నైట్ సఫారీ ఆశలు గల్లంతు

మొదటి పేజీ తరువాయి..

కూడా అటకెక్కాయి. ప్రస్తుతం సాధారణ జంతు ప్రదర్శనశాలల కంటే ఎంతో వైవిధ్యంగా, అరుదైన జంతుజాలం నివసించేందుకు అనువుగా నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇవేవీ పట్టనట్లు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనలు పక్కన పెట్టినట్లు తెలిసింది. అప్పటికే సిద్ధం చేసిన సమగ్ర నివేదికలను కాలరాస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు హైదరాబాద్ పర్యాటక రంగానికి ఇబ్బందిగా మారుతున్నాయి.

1994లోనే..

నైట్ సఫారీ పార్కుల నిర్వహణలో సింగపూర్ ముందంజలో ఉంది. 1994లోనే నైట్ సఫారీ పార్కులను ఏర్పాటు చేసింది. 2500కుపైగా జంతువులు, 130 జాతులతో 86 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టారు. అదే తరహాలో గండిపేట మండలం పరిధిలోని కొత్వాల్‌గూడ ఎకో పార్క్‌లోనే నైట్ సఫారీ ఏర్పాటు చేసేందుకు అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ సూచనలతో అధికారులు సింగపూర్ సంస్థలను ఆశ్రయించారు. వారి సాయంతో ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ఆ పనులను పక్కన పెట్టి, ఎప్పుడో మొదలైన కొత్వాల్‌గూడ ఎకో పార్క్‌ను కూడా పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్నది. దీంతో నగరానికి అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రం దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం పెండింగ్‌లో ఉన్న పనులనైనా పూర్తి చేయాలని హెచ్ఎండీఏను ఆదేశించడంలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేస్తుండటంతో ఎంతో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులకు రూపం లేకుండా పోతున్నాయి.

పేదలకు చేరువగా మర్రి రాజశేఖర్ రెడ్డి ఫౌండేషన్

ఉచితంగా శస్త్ర చికిత్స చేసిన అరుంధతి ఆస్పత్రి

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): మర్రి రాజశేఖర్ రెడ్డి ఫౌండేషన్ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందు వరుసలో నిలుస్తున్నది. ఆ ఫౌండేషన్ వ్యవస్థాకులు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి ఆపదలో ఉన్న తన నియోజకవర్గ ప్రజలను ఆదుకోవడంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. మల్కాజిగిరికి చెందిన సాయికుమార్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయాడు. శస్త్రచికిత్స చేయించుకునేందుకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫౌండేషన్ బాధితుడి పరిస్థితిని తెలుసుకొని అరుంధతి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేసి, వైద్యసేవలందించారు. ఈ విషయాన్ని బాధితుడి చెల్లి మహేశ్వరి సామాజిక మాధ్యమాల వేదికగా మాట్లాడుతూ..పేద ప్రజలకు తోడుగా నిలుస్తూ, ఉచితంగా వైద్యం అందించిన ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పెంపుడు జంతువుల పట్ల దిగులొద్దు

చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువచ్చిన వన్య ప్రేమికులు

డాక్టర్ రామ్ సింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 1: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పెంపుడు జంతువుల పట్ల దిగులువద్దని, అయితే కనీస జాగ్రత్తలు తీసుకోవాలని పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని రాజేంద్రనగర్ ఆసుపత్రి చికిత్స విభాగం హెడ్ డాక్టర్ రామ్‌సింగ్ సూచించారు. ఇటీవల రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు ప్రధానంగా అక్కడక్కడ వర్షాలు పడటం ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులతో పెంపుడు జంతువుల్లో ప్రధానంగా ఆవులు, గేదెలు, కుక్కలు, పిల్లులు, ఆరోగ్యం పరిస్థితులు నెలకొన్నాయని, వాటి పట్ల దిగులు చెందాల్సిన అవసరంలేదని, అయితే కనీస జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కనీసం సమీపంలోని వెటర్నరీ ఆసుపత్రిలో వ్యాక్సిన్ తీసుకోవాలని, ప్రస్తుతం నట్టలు నివారణ, సమీకృత ఆహారం, పెంపుడు కుక్కలకు ప్రస్తుత పరిస్థితుల్లో వీలైనంత వరకు మాంసాహారాన్ని తగ్గించి, శాఖాహారాన్ని ఇవ్వడంతోపాటు వాటిని శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. అస్వస్థతకు గురైతే ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించవద్దని, వీలైతే రాజేంద్రనగర్‌లోని అధునాతన పరికరాలతో ఉన్న ఆసుపత్రిని సంప్రదించాలని ఆయన సూచించారు.

వైద్యానికి ఇద్దరు.. మందులిచ్చేది ఒక్కరే

- ఈఎన్‌టీలో భర్తీకి సిద్ధంగా 4 ప్రొఫెసర్ పోస్టులు.. మూడు ఫార్మాసిస్ట్ పోస్టులు
- బదిలీతో వెంటాడుతున్న సిబ్బంది కొరత
- భర్తీ చేయకుండా చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): పదేండ్ల కాలంలో కేసీఆర్ సర్కారు వైద్యానికి పెద్దపీట వేస్తే, రేవంత్ ప్రభుత్వం దాన్ని విస్మరిస్తున్నది. బస్తీ దవాఖానలు మొదలుకొని జిల్లాలోని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఈఎన్‌టీ వంటి పెద్దాసుపత్రుల వరకు సిబ్బంది కొరత వెంటాడుతున్నది. ఎనిమిది నెలల కిందట చేసిన బదిలీల కారణంగా ఏర్పడిన ఖాళీలను భర్తీ ఇంత వరకు చేయకుండా కాంగ్రెస్ సర్కార్ చోద్యం చూస్తుండటంతో వైద్యం కోసం సర్కారు ఆసుపత్రుల మెట్లెక్కే వారికి సకాలంలో నాణ్యమైన వైద్యం అందించలేకపోతున్నారు. హైదరాబాద్ జిల్లాలోని కోఠిలో ఉన్న ఏకైన ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రిలో నేటికీ సరిపడా ఫార్మాసిస్టులు, వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బదిలీల కారణంగానే ఖాళీలు..

హైదరాబాద్‌లో ఉన్న ఈఎన్‌టీ ప్రభుత్వ ఆస్పత్రికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి సైతం రోగులు వస్తుంటారు. ప్రతి సోమవారం సుమారు 2వేల మంది వరకు ఔట్ ఫేషెంట్లు రాగా, మిగతా రోజుల్లో 1500 వరకు వస్తుంటారు. 125 మంది వరకు ఇన్‌ఫేషెంట్లుగా చికిత్స పొందుతుండటం గమనార్హం. ప్రభుత్వాసుపత్రి కావడంతో రోగుల తాకిడి అధికమనే చెప్పాలి. కానీ సరిపడా సిబ్బంది లేక వైద్యం కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గతంలో ఆరుగురు ప్రొఫెసర్లు, నలుగురు ఫార్మాసిస్టులు ఉండగా, ఎనిమిది నెలల కిందట జరిగిన బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లారు. దాంతో ప్రస్తుతం ఈఎన్‌టీలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక్క ఫార్మాసిస్టు మాత్రమే ఉన్నారు. రోగుల తాకిడి అధికంగా ఉండటంతో వార్డు నర్సులు సైతం ఫార్మసీలో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. అయినా కూడా ఫార్మాసిస్టుల కొరతను అధిగమించడం కష్టంగా మారింది. రోగులకు వైద్యం అందించి, శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తుండగా.. వారిలో నలుగురు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే తమ విభాగాలకు చెందిన రోగులను పరీక్షిస్తుండటం గమనార్హం. ఇదిలా ఉండగా వినికిడి లోపం ఉన్నవారికి చేసే కాక్‌లియర్ ఇంప్లాంట్ సర్జరీ వంటి కీలక శస్త్ర చికిత్సలకు సైతం ఇతర జిల్లాల వైద్యులను రప్పించడం జరుగుతుంది. వైద్యుల కొరతతో అత్యవసర చికిత్సలప్పుడు ఉన్నవారిపైనే తీవ్ర ప్రభావం పడుతున్నది.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ప్రస్తుత రోజుల్లో ఈఎన్‌టీకి రోగుల తాకిడి ఎక్కువైతున్నది. దీనిలో భాగంగా ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం చాలా ఉన్నది. ప్రస్తుతం ఉన్న ప్రొఫెసర్, ఫార్మాసిస్టు పోస్టులతోపాటు రెండు రేడియోగ్రాఫర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నది. రెగ్యులర్ రేడియోగ్రఫర్‌కు బదులు కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారితోనే పని చేయించడం వల్ల పని ఒత్తిడికి గురవుతున్నారు. సరిపడా సిబ్బందిని నియమించి పనిభారం తగ్గించాలని వైద్యులు వేడుకుంటున్నారు. మరోవైపు సిబ్బంది కొరత లేకుండా సత్వర వైద్యం అందించాలని రోగులు, బంధువులు అభిప్రాయపడుతున్నారు. బదిలీలు చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికి ఖాళీలను భర్తీ చేయకపోవడంపై ప్రతిపక్షాలు, సామాన్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగుల కోసం సరిపడా సిబ్బందిని నియమించాలని అభిప్రాయపడుతున్నారు.

ఈ భవనానికి 148 ఏండ్లు

చారిత్రాత్మక భవనం రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్.. సికింద్రాబాద్ ఎంజీ రోడ్‌లోని జేమ్స్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ పేరుతో పిలువబడే రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ 1877లో నిర్మించారు. ఈ పోలీస్ స్టేషన్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నది. గత కొద్ది కాలం కిందట శిథిలావస్థకు చేరడంతో మినిస్టర్ రోడ్డులోని రెవెన్యూలో ఈ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. తిరిగి ఈ భవనాన్ని పునరుద్ధరించడంతో ఇప్పుడు ఔట్‌పోస్టుగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నది.

సంతాప సభగా మారిన ఆత్మీయ సమ్మేళనం

కవాడిగూడ, జూన్ 1: దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల(1991)పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాలలో ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి 70మందికి పైగా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. ఇందులో పాల్గొనేందుకు వస్తున్న కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కడారి రవికుమార్(57)సిద్దిపేట సమీపంలో కొమురవెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆత్మీయ సమ్మేళనం రవికుమార్ సంతాప సభగా మారింది. తమతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థి రవికుమార్ మృతి చెందాడన్న వార్త వ్యాయామ ఉపాధ్యాయులను తీవ్ర విషాదానికి గురిచేసింది. ఆయన మృతిపట్ల వారు విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న రవికుమార్ కరీంనగర్ జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయసంఘం అధ్యక్షుడిగా జిల్లా క్రీడల సమాఖ్య నిర్వహణ కార్యదర్శిగా ఆయన అందించిన సేవలను వారు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి, ఓయూ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్, తెలంగాణ జూనియర్ కాళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సోమన్న, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.బాలరాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ జగన్మోహన్‌లు రవికుమార్ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

రవికుమార్ (ఫైల్)

నేరస్తుల చేతికి అక్రమాయుధాలు!

- ఎవరు కొనాలనుకున్నారు? నిందితుల నెట్‌వర్క్‌పై దృష్టి
- లోతైన దర్యాప్తు జరుపుతారా? ఇంతకే వదిలేస్తారా?

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): నేరస్తుల అక్రమాయుధాలు పొందేందుకు భిన్నరూట్లను ఎంచుకుంటున్నారు. దోపిడీలు, బెదిరింపులు, కిడ్నాప్, హత్యలు, సెటిల్‌మెంట్లు.. రౌడీయిజం చేయాలంటే చేతిలో ఒక గన్ ఉంటే.. ఈజీగా అవతలి వాళ్లను భయపెట్టించి తమ పని పూర్తి చేసుకోవచ్చనే భావనతో నేరస్తులు కంట్రీమేడ్ పిస్టోల్స్‌ను వాడుతుంటారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న యూపీ, బీహార్ ప్రాంతాలకు చెందిన వారు తమ ప్రాంతంలో తయారైన కంట్రీమేడ్ పిస్టోల్స్ అక్కడ తక్కువ ధరకు కొని, హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిని నేరస్తులు సంప్రదిస్తూ అక్రమంగా గన్స్ కొంటున్నారని సమాచారం. యూపీ, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర ఉత్తరాదీ రాష్ట్రాల నుంచి వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన వాళ్లు, ఇక్కడ అక్రమ గన్స్‌కు ఉన్న మార్కెట్‌ను అంచనా వేస్తూ, అవసరాన్ని బట్టి గన్స్‌ను తెస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల రాచకొండ కమిషనరేట్‌లోని బాలాపూర్ ఠాణా పరిధిలో నివాసముంటున్న ఉత్తరప్రదేశ్, రాంపూర్ సిటీకి చెందిన మహ్మద్ జీషాన్ అలియాస్ జీఖాన్, మహ్మద్ అమీర్‌లను మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఐదు కంట్రీమేడ్ తుపాకులను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ తుపాకులు ఎవరికి ఇవ్వాలనుకున్నారు.. ఎక్కడి నుంచి తెచ్చారు.. వీళ్ల నెట్‌వర్క్ ఏంటీ అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

అక్రమార్కుల చేతికి వెళ్తే..

రౌడీషీటర్లు, రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు, దోపిడీ దొంగతనాలు, కిడ్నాప్‌లు చేసే నేరస్తులు అక్రమ పద్ధతిలో ఆయుధాలను సమకూర్చుకుంటున్న ఘటనలున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి గన్స్ తెచ్చి ఇక్కడ విక్రయించాలనుకునే వారికి ఆయా ముఠాలతో ఏదో విధంగా లింక్‌లుండే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే గన్స్‌కి గిరాకీ ఉందని తెలుసుకుంటూ యూపీ, బీహార్ నుంచి అక్రమ మార్గంలో హైదరాబాద్‌కు గన్స్‌ను తెస్తున్నారు. రోడ్డు మార్గంలో రైళ్లు, బస్సుల్లో అంతగా తనిఖీలు ఉండకపోవడంతో ఈజీగా ఆయుధాలు యూపీ, బీహార్ నుంచి హైదరాబాద్‌కు తెస్తున్నారు. ఇలా అక్రమాయుధాలు తెచ్చిన వారు వాటిని కొన్నాళ్లపాటు దాచిపెట్టి తమ నెట్‌వర్క్ ద్వారా నేరస్తులకు విక్రయించే అవకాశాలున్నాయి. అయితే పోలీసులకు దొరుకుతున్న వాళ్లు మాత్రం మొదటి సారి గన్స్ విక్రయానికి ప్రయత్నిస్తూ పట్టుబడుతున్నారని తెలుస్తున్నది. ఈ అక్రమ వ్యాపారంలో అనుభవం ఉన్న వాళ్లు పోలీసులకు దొరకకుండా జాగ్రత్త పడే అవకాశాలున్నాయి. దీనిపై మరింత పటిష్ట నిఘా ఉండాల్సిన అవసరం ఉన్నది. పట్టుబడుతున్న ముఠాలు ఎవరికి విక్రయించారు.. ఎవరికి విక్రయించాలనుకున్నారనే విషయాలు లోతుగా ఆరా తీయాల్సిన అవసరం ఉన్నది. అక్రమ ఆయుధాలు సంఘ విద్రోహ శక్తుల చేతికి అందకుండా అడ్డుకుంటూ పోలీసులు నేరగాళ్లను పట్టుకుంటున్నా, వారి వెనుకాముందు ఎవరున్నారనే విషయాలపై లోతైన దర్యాప్తు జరిపితే మరిన్ని లింక్‌లు బయటపడే అవకాశాలున్నాయి.

మొన్న జవహర్‌నగర్.. నేడు బాలాపూర్

ఉత్తరప్రదేశ్, రాంపూర్ సిటీకి చెందిన మహ్మద్ జీషాన్ అలియాస్ జీఖాన్, మహ్మద్ అమీర్ బాలాపూర్‌తోపాటు సంతోష్‌నగర్, గోల్కొండ ప్రాంతంలో హెయిర్ సెలూన్ నిర్వహిస్తూ చాలా మందితో పరిచయాలు పెంచుకున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి గన్స్‌ను విక్రయించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా తమ స్వస్థలం నుంచి ఐదు కంట్రీమేడ్ పిస్టోల్స్‌ను హైదరాబాద్‌కు తెచ్చి విక్రయించాలనే ప్రయత్నంలో గత గురువారం మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులకు ఎవరితో పరిచయాలు ఉన్నాయి.. ఎవరికి విక్రయించాలనుకున్నారనే విషయాన్ని పోలీసులు తేల్చాల్సి ఉన్నది. ఎస్ఓటీ పోలీసులు ఛేదించిన కేసులను పూర్తి స్థాయిలో లా అండ్ ఆర్డర్ పోలీసులు విచారణ చేయరనే విమర్శలున్నాయి. ఇప్పుడు అక్రమ గన్స్ కేసును ఎస్ఓటీ పోలీసుల సహకారంతో బాలాపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఇది అంత వరకే ఉంటుందా? ఈ కేసులో మరిన్ని అరెస్ట్‌లుంటాయా? అనేది వేచి చూడాల్సిందే. అలాగే ఈ ఏడాది జనవరిలో జవహర్‌నగర్ పోలీసులు, మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా ఆయుధాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణయాదవ్‌ను అరెస్ట్ చేసి మూడు కంట్రీమేడ్ పిస్టోల్స్, 10 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

సకాలంలో వైద్యం ఎండమావే..!

ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు...

మొదటిపేజీ తరువాయి..

ఏరియా ఆసుపత్రుల్లో ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ వంటి పరికరాలు ఉన్నప్పటికీ పరీక్షలు నిర్వహించే రేడియాలజిస్టులు లేకపోవడం వల్ల సకాలంలో టెస్టులు నిర్వహించలేకపోతున్నారు. ఈ ప్రభావం వల్ల చాలా మంది పేదలు చేసేదేమీ లేక చేతి నుంచి డబ్బులు ఖర్చు పెట్టుకొని మరీ ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. నాంపల్లి, మలక్‌పేట ఏరియా ఆసుపత్రుల్లో రేడియాలజిస్టులు లేకపోగా, గోల్కొండలో మాత్రం పార్ట్‌టైం పద్ధతిలో ఒకరిని నియమించారు. రేడియాలజిస్టు కొరతకారణంగా గర్భిణులకు , ఇతర రోగులకు చేసే టెస్టులు సకాలంలో చేయకపోవడం వల్ల వారంతా ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. వారితో పాటు రోగులకు మందులను అందించే ఫార్మసిస్టుల కొరత తీవ్రంగా వెంటాడుతున్నది. నాంపల్లిలో ఉన్న గ్రేడ్ వన్ ఫార్మసిస్టు గజ్వేల్‌కు బదిలీ కావడంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. అక్కడ నాలుగు పోస్టులు ఉండగా, ఇద్దరితోనే సాగిస్తున్నారు. మలక్‌పేటలో నలుగురు అవసరమవుతుండగా ఒక్కరే ఉన్నారు. గోల్కొండలో సైతం ఒక్క ఫార్మసిస్టు మాత్రమే పనిచేస్తుండటం గమనార్హం. ఖాళీలు భర్తీ చేయకపోగా, ఉన్నవారిపైనే తీవ్రంగా పని భారం పడుతున్నది. నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయడంలో జాప్యం చేస్తున్నది.

తల్లీబిడ్డల మృతి బాధాకరం : ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, జూన్ 1: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తల్లీబిడ్డలు మృతి చెందడం బాధాకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బాలానగర్ పీహెచ్‌సీ ప్రసవాల విషయంలో ఎంతో పేరు, ప్రఖ్యాతలు సంపాదించుకున్నదని గుర్తు చేశారు. పీహెచ్‌సీల నిర్వహణను ఉన్నతాధికారులు పరిశీలించడం లేదని, అందువల్లే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మృతి చెందిన తల్లీబిడ్డలకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మెహిదీపట్నంలో చైన్ స్నాచింగ్

మెహిదీపట్నం, జూన్ 1 : వాకింగ్‌కు వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును తెంపుకొని పారిపోయిన సంఘటన మెహిదీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. విజయనగర్ కాలనీలో నివసించే చంద్రకళ(55)ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వాకింగ్ చేస్తున్నది. వెనుక నుంచి వాహనంపై వచ్చిన ఓ అగంతకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. చోరీకి గురైన గొలుసు సుమారు రెండు తులాల వరకు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉన్నది.

రిటైర్డ్ ఎస్పీ ఇంట్లో చోరీ

వెంగళరావునగర్, జూన్ 1: రిటైర్డ్ ఎస్పీ ఇంట్లోని అల్మారాలో దాచిన బంగారు మంగళసూత్రాన్ని అపహరించుకెళ్లిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట శివబాగ్ కాలనీలో నివాసం ఉండే రిటైర్డ్ ఎస్పీ కె.వి.పటేల్ తల్లి కె.కౌసల్య ఇంట్లోని అల్మారాలో 10 తులాల మంగళసూత్రాన్ని దాచిపెట్టారు. గత నెల 29వ తేదీన అల్మారా తెరిచి చూడగా..అందులోని బంగారు మంగళసూత్రం కనిపించలేదు. దీంతో చోరీకి గురైందని గ్రహించి ఆదివారం ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోలీసులు చేస్తున్నారు.

వృద్ధుడికి రూ.94 లక్షల బురిడీ

సిటీబ్యూరో: ఇన్సూరెన్స్ పాలసీలపై అదనంగా డబ్బులు ఇస్తామంటూ ఆశ చూపుతూ ఓ వృద్ధుడిని సైబర్‌నేరగాళ్లు మోసం చేశారు. మహేశ్వరం మండలంలోని తుమ్మళ్లూరు ప్రాంతానికి చెందిన బాధితుడికి ఆదిత్య బిర్లా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీలు ఉన్నాయి. అయితే ఆ పాలసీల వివరాలను తెలుసుకున్న సైబర్‌నేరగాళ్లు తాము ఆదిత్య బిర్లా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామంటూ నమ్మించారు. ఆయా పాలసీలపై రుణాలిస్తామని, వాటి మెచ్యురిటీకి ముందే డ్రా చేసుకుంటే ఎక్కువగా ఇప్పిస్తామని, అందుకు ఆదాయ పన్ను చెల్లించాలని, సర్వీస్ ట్యాక్స్, రెగ్యులేటరీ ఫీజు, పాలసీ రియాక్టివేట్ ఫీజులు చెల్లించాలని, ఈ పాలసీలను క్లోజ్ చేసి, కొత్త పాలసీలు తీసుకోవాలంటూ ఇలా రకరకాలుగా యష్ చోప్ర, సురేశ్ పసం, రామశంకర్ చౌదరీ తదితరులు ఫోన్ చేశారు. నిజమైన పాలసీ కంపెనీ ఉద్యోగులుగా మాట్లాడుతూ.. బాధితుడి వద్ద నమ్మకం కుదిర్చుకున్న సైబర్‌నేరగాళ్లు 2023 నుంచి 2025మే వరకు రూ. 94,28,710 మోసం చేశారు. ఇంకా డబ్బులు అడుగుతుండడంతో అనుమానం వచ్చిన బాధితుడు ఇదంతా మోసమని గ్రహించి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సినీ దర్శకుడికి గాయాలు

బంజారాహిల్స్, జూన్ 1: రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొట్టడంతో సినీ దర్శకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మణికొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న వర్ధమాన సినీ దర్శకుడు శివనాగేంద్రనాథ్(27) శనివారం రాత్రి 12:30 గంటల సమయంలో షేక్‌పేట నుంచి మణికొండ వైపునకు తన బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో మణికొండ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు షేక్ రఫీ, ఫిరోజ్, అజారుద్దీన్ కారులో గచ్చిబౌలికి వెళ్లే క్రమంలో రాంగ్‌రూట్‌లో వస్తూ డీ-మార్ట్ సమీపంలో శివనాగేంద్రనాథ్ బైక్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన శివనాగేంద్రనాథ్‌ను స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. కారు నడిపిస్తున్న షేక్ రఫీతో పాటు షేక్ అజారుద్దీన్‌లు మద్యం సేవించినట్లు తేలింది. కారు నడిపిస్తున్న రఫీతో పాటు కారులోని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు వారిని ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

ఒకేరోజు 305 మంది పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 305 మంది వాహనదారులను సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. పట్టుబడిన 305 మంది వాహనదారుల్లో 242 మంది ద్విచక్ర వాహనదారులే ఉండటం గమనార్హం. కాగా, 16 మంది త్రిచక్రవాహనదారులు, 47 మంది నాలుగు చక్రాల వాహనదారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లైఓవర్ పై నుంచి దూకి..

శేరిలింగంపల్లి జూన్ 1: బొటానికల్ గార్డెన్ ఫ్లైఓవర్ పైనుంచి ఓ వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గచ్చిబౌలి పోలీసులు, కుంటుంబసభ్యులు తెలిపిన ప్రకారం... శ్రీకాకుళం జిల్లా, హీరా మండలం అంబేద్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన గొట్టివాడ చిన్నా ఆలియాస్ సూర్య(28) ఒడిశాకు చెందిన రమ్యను ప్రేమ వివాహం చేసుకొని.. మాదాపూర్‌లో ఉంటున్నారు. ఆదివారం ఉదయం భార్య రమ్యతో గొడవపడి బయటకు వచ్చాడు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా భార్య ఫోన్ ఎత్తలేదు.ఈ క్రమంలో మధ్యాహ్నం 'నేను వెళ్లి పోతున్నా. మీరు జాగ్రత్తగా ఉండండి' అని అక్క బావకు వాయిస్ మెసేజ్ పెట్టాడు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే కొత్తగూడ ఫ్లైఓవర్ పై నుంచి బొటానికల్ గార్డెన్ జంక్షన్లో దూకాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయాడు.

నమస్తే తెలంగాణ క్లాస